## క్లుప్తంగా

### గంగాలమ్మకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో గంగాలమ్మ

నరసాపురం రూరల్: మండలంలోని ఎల్బీచర్ల గ్రామంలో వేంచేసియున్న శ్రీగంగాలమ్మవారికి ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రావణమాసం ఆదివారం కావడంతో పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకొని అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి మొక్కుబడులు చెల్లించి నైవేద్యాలు సమర్పించారు.

### మావుళ్లమ్మకు సారె సమర్పణ



మావుళ్లమ్మకు సారెను సమర్పిస్తున్న కారుమూర్తి సత్యనారాయణ, కుటుంబ సభ్యులు

భీమవరం (ప్రకాశం చౌక్): శ్రావణమాసం పురస్కరించుకుని పట్టణ ఇలవేల్పు మావుళ్లమ్మ అమ్మవారికి భీమవరానికి చెందిన కారుమూరి సత్యనారాయణ ఆదివారం సారె సమర్పించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి వచ్చి అమ్మవారికి చీర, పసుపు, కుంకుమ, వివిధ రకాల ఫలాలు, స్వీట్లు అందజేశారు. దాతలకు ఆలయ ఉప ప్రధాన అర్చకులు కొప్పేశ్వరరావు వేద ఆశీర్వచనాలు అందించగా ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్ శేషవస్త్రం, ప్రసాదాలు అందించి సత్కరించారు.

### కేథలిక్ నన్స్‌పై దాడిని ఖండిస్తూ ధర్నా




భీమవరంలో ధర్నా చేస్తున్న దృశ్యం

భీమవరం: చత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో కేథలిక్ నన్స్‌పై మతమార్పిడి పేరుతో దాడిచేయడాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక ప్రకాశంచౌక్ సెంటర్‌లో ఐక్య క్రైస్తవ సంఘం, దళిత సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. దళిత ఐక్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు గంటా సుందరకుమార్ మాట్లాడుతూ క్రైస్తవ నన్స్ శాంతిప్రియులని ఆపదలో ఉన్నవారికి సహాయం చేసేవారని, అటువంటివారిపై దాడులు చేసి జైలులో పెట్టడం దారుణమన్నారు. ధర్నాలో రాజ్ ట్రస్ట్ అధ్యక్షుడు గంటా రాజ్‌కుమార్, వి సుజ్ఞానరాజు, పిల్లా డైమండ్‌రాజు, గొల్లా రాజ్‌కుమార్, కొండేటి లాజర్, పట్టెం సుభాకర్, కర్రా కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

### స్మార్ట్ మీటర్లను ప్రజలంతా అడ్డుకోవాలి

భీమవరం అర్బన్: అదానీ స్మార్ట్ మీటర్లను ప్రజలంతా అడ్డుకోవాలని ప్రజా సంఘాల ఐక్య వేదిక నాయకులు ఇంజేటి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ ఈ నెల 5న జరిగే ధర్నాలో ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ తోకతిప్ప గ్రామంలో ఆదివారం కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇంజేటి శ్రీనివాస్ మాట్లాడుతూ అనుమతి లేకుండా తమ ఇళ్ల వద్ద స్మార్ట్ మీటర్లు పెడితే కేసులు పెట్టాలని హితవు పలికారు. గతంలో చెత్త పన్నుపై పోరాడితే రద్దు చేశారని, ఇప్పుడు స్మార్ట్ మీటర్లపై పోరాడాల్సిన ఆవశ్యకత అందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పొన్నమండ నాగేశ్వరరావు, తిరుమాని సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### ఘనంగా మావుళ్లమ్మ జాతర

భీమవరం: స్థానిక రెస్ట్‌హౌస్ రోడ్డులోని రామాలయం వద్ద తూర్పు కాపు సంఘం జాతర కమిటీ ఆధ్వర్యంలో శ్రీమావుళ్ళమ్మ 65వ జాతర మహోత్సవాలను ఆదివారం ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. ముందుగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పుల వాయిద్యాలు, గరగల నృత్యాలు, శక్తి వేషధారణలతో జాతర నిర్వహించారు. జాతర కమిటీ సభ్యులు అడపా హరి, అడపా రాము, సతివాడ నవీన్, ఏకే నాయుడు, సంతక ప్రకాష్, మంతి గణపతి, పిన్నెంటి రవి, తాడి రమేష్ పాల్గొన్నారు.

### నేడు ఉచిత వైద్య శిబిరం

భీమవరం: స్థానిక కుముదవల్లి రోడ్డులోని కేఎస్ రాజు ఫంక్షన్ హాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి రక్తదాన, వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అయినంపూడి శ్రీదేవి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# రోడ్లపై మైనర్ల దూకుడు

- పిల్లలకు మోటార్ సైకిళ్లు ఇస్తున్న తల్లిదండ్రులు
- ఎదురుగా వచ్చే వాహనదారులకు ఇబ్బందులు
- రాంగ్ రూట్‌లో ప్రయాణంతో ప్రమాదాలు
- వాహన యజమానికి 3 వారాల జైలు తప్పదు
- పోలీసు హెచ్చరికలను బేఖాతరు చేస్తున్న వైనం



బైక్‌పై వెళుతున్న మైనర్

నరసాపురం రూరల్: ఇటీవల రోడ్లపై మైనర్ల మోటార్ సైకిల్ దూకుడు పెరిగిపోయింది. చేతిలో ఎక్స్‌లేటర్ తిప్పితే రయ్ రయ్‌మంటూ దూసుకుపోతోంది. ద్విచక్ర వాహనాలు, కార్ల సంఖ్య పెరిగిపోయింది. రోడ్లన్నీ నిత్యం రద్దీగా ఉంటున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో నిండా 15 ఏళ్లు కూడా లేని మైనర్లు బైక్‌లు, ఇతర మోటార్ సైకిళ్లతో వీధుల్లోనే కాక ప్రధాన రహదారుల్లో సైతం రాకపోకలు సాగిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో మట్టి, ఇసుక ట్రాక్టర్లను కూడా మైనర్లు డ్రైవింగ్ చేస్తున్నారు. మైనర్లకు రోడ్ నిబంధనలు, జాగ్రత్తలపై అవగాహన లేక తమ ఇష్టం వచ్చినట్టు డ్రైవింగ్ చేయడం వలన ఎదురుగా వచ్చే వాహనాదారులకు ఇబ్బందులు కలగజేస్తున్నారు. ఒక్కో సారి ప్రమాదాలకు గురవుతున్నారు. ఎదుట వాహనదారులను ప్రమాదాలకు గురి చేస్తున్నారు. తెలిసీ తెలియని వయసులో వాహనాలను వేగంగా నడుపుతూ తమ ముందు వెళుతున్న వాహనాలను అధిగమిస్తున్నారు. బాలురు బైక్‌లు, బాలికలు స్కూటీలతో ప్రధాన రహదారులపై ప్రయాణిస్తున్నారు. బాలురైతే ఒకే బండిపై ముగ్గురు, నలుగురు ఎక్కి ప్రయాణిస్తున్న సందర్భాలూ ఉంటున్నాయి. మరి కొందరు బైక్‌లతో విన్యాసాలు చేస్తూ ఇతర వాహనదారులను హడలెత్తిస్తున్నారు. ఒక్కో సారి వాహనం గేరు మార్చడానికి, అకస్మాత్తుగా ముందు మరో వాహనం వస్తే బ్రేక్ వేయడానికి అవకాశం లేని విధంగా మెరుపు వేగంతో దూకుడుగా వెళుతూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. ఇటీవల కాలంలో పోలీస్ బీట్లు విస్తృతం చేశారు. ప్రతి నిత్యం పలు కూడళ్ల, ప్రాంతాల్లో పోలీసులు విధులు నిర్వహిస్తూ నిబంధనలకు విరుద్ధంగా వాహనాలు నడుపుతున్నా, నిబంధనలు పాటించకపోయినా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు. పలువురిపై కేసులు నమోదు చేస్తున్నారు. జరిమానాలు కూడా వేస్తున్నారు. అయినా అనేక మంది నిబంధనలు పాటించడం లేదు.

**అవగాహన లేకే ప్రమాదాలు**

తల్లిదండ్రులు తమ పిల్లలకు ద్విచక్ర వాహనాలు ఇస్తున్నారు. మా అబ్బాయి బైక్ నడుపుతున్నాడు. మా అమ్మాయి స్కూటీ నడిపేస్తుందని మురిసిపోతున్నారు. వారిని పలు పనుల నిమిత్తం మోటార్ సైకిళ్లు ఇచ్చి బయటకు పంపుతున్నారు. మా అబ్బాయి లేదా మా అమ్మాయి మోటార్ సైకిల్ డ్రైవ్ చేసేస్తోంది. అనే ఆనందం తమ పిల్లలు మేజర్లు అయ్యే వరకూ ఆ వీధికే పరిమితం కావాలి. తల్లిదండ్రులు తమ పిల్లల వెంటే ఉండి జాగ్రత్తలు తీసుకుంటూ డ్రైవ్ చేయించుకోవాలి. ఆ వీధిలో రోడ్డుకే పరిమితం కావాలి. కానీ పలువురు తల్లిదండ్రులు అలా చేయకుండా బైక్‌పై వెళ్లొచ్చెయ్ అంటూ బైక్ ఇచ్చేస్తున్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వడం మోటార్ వాహన చట్టం ప్రకారం నేరం. ఇది తెలిసినా చాలా మంది తల్లిదండ్రుల్లో మార్పు రావడం లేదు. దీంతో మైనర్లు పూర్తిగా అనుభవం లేకుండా వాహనాలు డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారకులవుతున్నారు. నిబంధనలు పాటిస్తూ రోడ్లపై వెళుతున్న వాహనదారులను మైనర్లు నిబంధనలకు విరుద్ధంగా వాహనాన్ని నడిపి ఢీ కొడుతున్నారు. పలువురు మైనర్లు ప్రమాదాలకు గురై తమ జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. కొందరు తల్లిదండ్రులకు కడుపు కోత మిగులుస్తున్నారు.

### నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు



మోటార్ సైకిళ్ల డ్రైవింగ్‌లో నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవు. ముఖ్యంగా మైనర్లకు మోటార్ సైకిళ్లు ఇవ్వడం మోటార్ వాహన చట్టం ప్రకారం నేరం. నిబంధనలు పాటించకుండా వాహనాలు నడపడం, జాగ్రత్తలు పాటించకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. వాటిని అరికట్టేందుకు ఎక్కడికక్కడ పోలీసులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించి, జరిమానాలు వేస్తున్నారు. ఇది పోలీసు శాఖ కోసం కాదు. తిరిగి నిబంధనలు అతిక్రమించకుండా మళ్లీ ఆ తప్పు చేయకుండా ఉండేందుకే. ముఖ్యంగా మైనర్ల డ్రైవింగ్ విషయంలో తల్లిదండ్రులు కూడా బాధ్యులవుతారు. పిల్లలకు వాహనాలు ఇవ్వొద్దని కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాం.

– జి.దుర్గా ప్రసాద్, నరసాపురం రూరల్ సీఐ

### నేడు పీజీఆర్ఎస్

నరసాపురం: సబ్‌కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పీజీఆర్ఎస్) కార్యక్రమం నిర్వహిస్తామని ఆర్డీవో దాసిరాజు చెప్పారు. డివిజన్‌లోని అన్ని శాఖల అధికారులు అందుబాటులో ఉంటారని వివరించారు. ప్రజలు తమ ఫిర్యాదులు, దరఖాస్తులు ఉదయం 10.30 గంటల నుంచి అందించాలని చెప్పారు.

### వసుధ ఫౌండేషన్ ఆర్థిక సాయం

పాలకొల్లు సెంట్రల్: నరసాపురం మండలం దర్బరేవుకు చెందిన చేకూరి సత్యనారాయణరాజు గత కొంత కాలంగా పెరాలసిస్‌తో బాధపడుతున్నారు. విషయం వసుధ ఫౌండేషన్‌కు సమాచారం ఇవ్వగా చైర్మన్ మంతెన వెంకట్రామరాజు స్పందించి రూ.10 వేలు చెక్కును పంపించినట్లు పట్టణ కన్వీనర్ బుద్దరాజు తెలిపారు. ఆదివారం బాధితుని కుటుంబ సభ్యులకు పెన్మెత్స జగపతిరాజు చెక్కును అందించారు. ఫౌండేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆర్టీసీ బస్సుల ద్వారా పుస్తకాల పంపిణీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణంలోని ఏపీ గవర్నమెంట్ జిల్లా పుస్తక పంపిణీ కేంద్రం నుంచి ఉభయ గోదావరి జిల్లాలోని 48 మండలాలకు గవర్నమెంట్ అసెస్మెంట్ బుక్స్ 12,03,428 పుస్తకాలను ఆర్టీసీ బస్సులు ద్వారా పంపిణీ చేస్తున్నారు. ప్రతి రోజు బస్సు ద్వారా మూడు మండలాల చొప్పున ఆయా మండల కేంద్రాలకు ఈ పుస్తకాలు చేరుతున్నాయి. జిల్లాలోని మూడు మండలాలకు ఆదివారం ఈ పుస్తకాలను పంపిణీ చేశారు. టెక్స్‌బుక్స్ మేనేజర్ పీవీ సుధాకర్, ఆర్టీసీ సూపర్‌వైజర్ డి.విజయకుమార్, హమాలీలు, బస్సు డ్రైవర్లు పాల్గొన్నారు.

# పాలిథిన్ వాడకాన్ని అరికట్టేవారేరి?



పాలిథిన్ కవర్‌లో వేడి వేడి టీ పోస్తున్న విక్రయదారుడు



పాలిథిన్ కవర్‌లో ప్యాక్ చేసిన వేడి సాంబార్

- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు
- తూతూమంత్రంగా అవగాహన చర్యలు, దాడులతో సరిపెడుతున్న వైనం
- ఫొటోలకే పరిమితమవుతున్న అధికారులు

యలమంచిలి: పాలిథిన్ కవర్ల వాడకం వలన అనేక దుష్పరిమాణాలు ఏర్పడుతున్నా వాటిని అరికట్టడంలో మాత్రం అధికారులు విఫలమవుతున్నారు. ఏటా పాలిథిన్ కవర్ల వినియోగం పెరుగుతుండటంతో పర్యావరణ ప్రేమికులు ఆందోళన చెందుతున్నారు. పాలిథిన్‌కవర్ల వినియోగంపై నిషేధం ఉన్న అధికారుల ఉదాసీనత వలన మార్కెట్‌లో కవర్లు యథేచ్ఛగా వినియోగిస్తున్నారు. వీటి వాడకం ఏ స్థాయికి చేరిందంటే టీ సెంటర్లలో టీ, కాఫీ హోటళ్లు, కూరల విక్రయాల కేంద్రాల్లో సాంబారు వంటి వేడి వేడి ద్రవ పదార్థాలు సైతం పలుచటి పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి అమ్ముతున్నారు. జ్యూస్ సెంటర్లలో కూడా అతి చల్లని జ్యూస్‌లను పాలిథిన్ కవర్లలో ప్యాక్ చేసి ఇస్తున్నారు. ఈ విధంగా అతి చల్లని, అతి వేడి పదార్థాలు పలుచటి పాలిథిన్ కవర్లలో వేయడం వలన ప్లాస్టిక్ కరిగి ఈ ఆహార పదార్థాల్లో చేరుతుంది. వాటిని సేవించడం వలన క్యాన్సర్ వంటి ప్రాణాంతక రోగాలు వచ్చే అవకాశం ఎక్కువగా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**అధికారుల ఉదాసీనత**

దశాబ్ద కాలం క్రితం పాలిథిన్ కవర్ల వాడకంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధం విధించాయి. ఆ సమయంలో అధికారులు దాడులు చేసి పట్టుకొని అపరాధ రుసుం విధించేవారు. దీంతో చాలా మంది దుకాణాల యజమానులు తమ దుకాణాల వద్ద పాలిథిన్ కవర్ల ఇవ్వబడవు అనే బోర్డు పెట్టేవారు. అదే సమయంలో అనేక స్వచ్ఛంద సంస్థలు ప్రజలకు గుడ్డ సంచులను పంపిణీ చేశాయి. కాలక్రమేణ అటు అధికారుల్లోనూ, ఇటు దుకాణాల యజమానుల్లోనూ ఉదాసీనత రావడంతో పాలిథిన్ కవర్ల వినియోగం పూర్వ స్థితికి చేరుకుంది.

**ఆరోగ్యానికి, పర్యావరణానికి ముప్పు**

పాలిథిన్ కవర్ల వినియోగం వలన ఇటు మానవుల ఆరోగ్యం దెబ్బతినడమే కాకుండా అటు పర్యావరణం దెబ్బ తింటుంది. పాలిథిన్ మితిమీరి వాడడం వలన వాటి మలినాలు మానవ శరీరంలో చేరి అనేక ప్రాణాంతక రోగాలను కలుగజేస్తున్నాయి. ఆహార పదార్థాలు తిని పాడేసిన కవర్ల నుంచి వచ్చే వాసనను పసిగట్టి ఆవులు, గేదెలు, కుక్కలు వంటి జంతువులు కవర్లతో వాటిని తింటున్నాయి. దీంతో వాటికి జీర్ణకోశ వ్యాధులు వచ్చి ప్రాణాలు కోల్పోతున్నాయి. వాడి పడేసిన పాలిథిన్ కవర్లు మట్టిలో కరగకపోవడం వలన పర్యావరణం దెబ్బతింటుంది. మురుగు కాలువలు, పంట కాలువల్లో నీటి ప్రవాహానికి అడ్డు పడుతూ అవి మురికిగా మారడానికి కారణమవుతున్నాయి. తద్వారా దోమలు ప్రబలి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఇన్ని అనర్థాలకు కారణమవుతున్న పాలిథిన్ కవర్ల వాడకాన్ని కఠినంగా అరికట్టవలసిన బాధ్యత అధికారులపై ఉంది.

### బాప్టిస్ట్ సంఘాల బలోపేతానికి కృషి చేస్తా



చెరుకువాడలో బాప్టిస్ట్ ఆకివీడు ఫీల్డ్ నూతన కమిటీని సత్కరిస్తున్న దృశ్యం

ఉండి: బాప్టిస్ట్ చర్చ్ ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్‌లోని 74 గ్రామాలకు గాను నియామకమైన నూతన కమిటీ ప్రతినిధులను చెరుకువాడ చినపేట సీబీసీఎన్‌సీ చర్చ్‌లో ఘనంగా సత్కరించారు. ఆదివారం ఎన్ జార్జ్‌ముల్లర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్ అధ్యక్షుడు బూరగ జెంజిమెన్, కార్యదర్శి కోరాటి శ్యామ్, కార్యవర్గ సభ్యులు బీ శ్రీకాంత్, కే ఏసుబాబు, ఎం సుబ్బారావు, పీ మార్కురాజు, బీ జార్జ్, టీ పవన్‌లను సత్కరించారు. ఈ సందర్భంగా బెంజిమెన్ మాట్లాడుతూ సీబీసీఎన్‌సీ చర్చ్ ఈస్ట్ ఆకివీడు ఫీల్డ్‌కు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సంఘ నాయకులకు, విశ్వాసులకు ధన్యవాదాలు తెలిపారు. బాప్టిస్ట్ సంఘాల బలోపేతానికి కృషి చేస్తానని ఈ సదర్భంగా చెప్పారు. ఈ కార్యక్రమంలో డీ పౌలు, ఎం యేసుబు, ఎం చలపతిరావు, టీ చిన్నా, సీహెచ్ వెంకటేష్, జీ బాబ్జీ, కే జాన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా శ్రీనివాసరాజు



లయన్స్‌క్లబ్ నూతన అధ్యక్షుడు శ్రీనివాసరాజు అభినందిస్తున్న దృశ్యం

కాళ్ల: ఏలూరుపాడు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడిగా దాట్ల శ్రీనివాసరాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివాయం సాయంత్రం గ్రామంలో నిర్వహించిన లయన్స్‌క్లబ్ సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కమిటీ క్లబ్ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ భూపతిరాజు జగ్గరాజు, డాక్టర్ ఆర్‌వీఎస్ రాజు, మోటుపల్లి శ్రీనివాసరావు, మంతెన రవివర్మ, పేర్ని సుబ్రహ్మణ్యం, మంతెన ఆంజనేయరాజు, కనకగర్ల గణేష్, మధుసూదనరావు, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

# అడుగు వేస్తే.. జారి పడాల్సిందే

అధ్వానంగా ప్యాట్రిక్ నగర్ రోడ్డు



బురదమయంగా మారిన స్థానిక ప్యాట్రిక్ నగర్‌కు వెళ్లే రహదారి

ఆకివీడు: స్థానిక నగర పంచాయతీ పరిధిలోని జాతీయరహదారికి చేర్చి ఉన్న ప్యాట్రిక్ నగర్‌కు వెళ్లే రహదారి అధ్వానంగా ఉండడంతో కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షం వస్తే అటుగా వెళ్లే ప్రజలకు ఈ దారి నరకప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై అడుగు వేస్తే జారి ఆమడ దూరాన పడాల్సిందే. తమ కాలనీకి కనీసం డ్రైయినేజీ వసతి కూడా లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి పన్ను చెల్లిస్తున్నా తమను పట్టించుకునే నాథుడులేడని వాపోతున్నారు. ఏళ్ల తరబడి రహదారిలేక నానా యాతన పడుతున్నామని మహిళలు, వృద్ధులు, పిల్లలు ఆవేదన చెందుతున్నారు. నగర పంచాయతీ నిధుల్లో దళిత పేటలకు కేటాయించాల్సిన నిధుల్ని ఎక్కడ వెచ్చిస్తున్నారని వారు ప్రశ్నిస్తున్నారు.

### లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం

తాడేపల్లిగూడెం (టీఓసీ): లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. లయన్స్‌క్లబ్ సేవా కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉదయం 9 గంటలకు కడకట్ల జనతా ఆసుపత్రి ఆవరణలో జనతా వైద్యులు ఎల్ఎస్‌వీ నాగేశ్వరరావు పర్యవేక్షణలో అధ్యక్షుడు చిన్నం మనీంద్ర ఆధ్వర్యంలో ఉచిత డయాబెటిక్ రెటినోపతి పరీక్ష శిబిరం జరిగింది. గరికపాటి బాపయ్యశర్మ ఆర్థిక సహకారం అందజేశారు. వక్తలు మాట్లాడుతూ కళ్లను ప్రతి ఒక్కరూ చూసుకోవాలన్నారు. షుగర్ వ్యాధి వచ్చిన వారికి కంట్లో అతి సూక్ష్మమైన నరాలు దెబ్బతినడం వల్ల కంటి చూపు పూర్తిగా నశించే ప్రమాదం ఉందని జాగ్రత్తలు పాటించాలన్నారు.

### బధిరుల పాఠశాల వార్షికోత్సవానికి ఏర్పాట్లు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: పట్టణంలోని శ్రీవెంకటేశ్వర బధిరుల పాఠశాల 40వ వార్షికోత్సవాన్ని పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు బధిరుల సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు చెరుకువాడ రంగసాయి, అధ్యక్షుడు సీహెచ్ తాతారావు చెప్పారు. ఆదివారం భీమవరంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో వేడుకల బ్రోచర్ ఆవిష్కరించి వివరాలను వెల్లడించారు. రాష్ట్ర వ్యాప్త బధిర అసోసియేషన్ల ఆహ్వాన మేరకు ఈ వేడుకలను నిర్వహిస్తున్నామని, పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో సెప్టెంబర్ 10వ తేదీన డీఎన్నార్ కళాశాల రామకృష్ణ సభాభవనంలో నిర్వహించనున్నామన్నారు. వేడుకల్లో భాగంగా ఈనెల 8, 18, సెప్టెంబర్ 3వ తేదీల్లో బధిరులకు వివిధ కార్యక్రమాలు చేపడతామని రంగసాయి, తాతారావు తెలిపారు. ఈ వేడుకలకు పూర్వ విద్యార్థులంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు గొట్టుముక్కల శ్రీనివాసరాజు, వి రాము, ఆర్ ఉమామహేష్ తదితరులు పాల్గొన్నారు.

### అగ్నిమాపక కేంద్రం భవన నిర్మాణానికి శంకుస్థాపన



భవన నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మోషేనురాజు, అంజిబాబు, రాహుల్‌కుమార్‌రెడ్డి

భీమవరం: ప్రకృతి వైపరీత్యాలు సంభవించిన సందర్భాల్లో అగ్నిమాపకశాఖ అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేనురాజు, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. ఆదివారం భీమవరంలో నూతనంగా నిర్మించే జిల్లా అగ్ని మాపక కేంద్ర కార్యాలయానికి శంకుస్థాపన చేసిన సందర్భంగా వారు మాట్లాడారు. 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2 కోట్ల వ్యయంతో జిల్లా అగ్ని మాపక కార్యాలయ భవనం, అగ్నిమాపక కేంద్రాలను అన్ని వసతులతో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ టి రాహుల్‌కుమార్‌రెడ్డి, జిల్లా అగ్నిమాపకాధికారి బి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# మున్సిపాలిటీ ఆదాయానికి గండి

- పెరగని ఎంటర్‌టైన్‌మెంట్ ట్యాక్స్
- వినోదపు పన్నుల విషయంలో మున్సిపాలిటీకి నష్టం
- నిర్లక్ష్యంలో నరసాపురం మున్సిపల్ అధికారులు



నరసాపురం మున్సిపల్ కార్యాలయం

నరసాపురం : వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో నరసాపురం మున్సిపాలిటీకి భారీగా నష్టం కలుగుతోంది. కనీస స్థాయిలో కూడా వినోదం, ప్రకటనలకు సంబంధించి పన్నులు మున్సిపాలిటీకి జమ కావడం లేదు. ఇక ఏటా వచ్చే నామ మాత్రపు ఆదాయం కూడా, ఏళ్ల తరబడి వసూలు కాకుండా, మొండి బకాయిగా మిగిలిపోతుంది. వినోదం పన్ను రూపంలో మున్సిపాలిటీకి ఏడాదికి రూ.3 లక్షలు మాత్రమే వసూలు అవుతుంది. ఇక ప్రకటనల పన్ను అయితే రూ.1.23 లక్షలు, మొత్తంగా రూ.4.23 లక్షలు పన్నులు వినోదం, ప్రకటనల రూపంలో వస్తున్నాయి. ఏడాదికి మున్సిపాలిటీకి ఆస్తి, కుళాయిలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, తదితర రూపాల్లో రూ.2.97 కోట్ల ఆదాయం వస్తోంది. ఇందులో వినోదం, ప్రకటనల పన్నుల వాటా చూసుకుంటే అత్యంత నామమాత్రంగా ఉంటుంది.

**అదీ వసూలు కావడం లేదు**

వినోదం పన్నులు రూ.10 లక్షలు, ప్రకటనల పన్నులు రూ.3 లక్షల వరకూ పాత బకాయిలున్నాయి. వినోదపు పన్నుల వద్దకు వచ్చే సరికి కేవలం సినిమా థియేటర్ల పైనే ఆధారపడుతున్నారు. కేబుల్ నిర్వాహకుల నుంచి సవ్యంగా పన్నులు వసూలు చేయడం లేదు. సిటీ కేబుల్ నిర్వాహకుల నుంచి లక్షల్లో పన్నులు వచ్చే ఇవకాశం ఉన్నా, వారి వద్ద నుంచి పన్నులు వసూలు చేయాలనే నిబంధనలు ఉన్నా, పట్టించుకోవడం లేదు. ఇక ఈ మధ్య కాలంలో ఎక్కడ పడితే అక్కడ ప్రకటనల హోర్డింగులు, ఫ్లెక్సీలు కనిపిస్తున్నాయి. వీటి నుంచి కూడా పన్నులు వసూలు చేయడం లేదు. రాజకీయ వత్తిళ్లకు తలొగ్గుతున్నారు. ఆదాయం వచ్చే మార్గాల్లో మాత్రం ఉదాసీనంగా వ్యవహరిస్తూ అధికారులు మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొడుతున్నారు. వినోదపు పన్నులు, ప్రకటనల చార్జీల పర్యవేక్షణ మొత్తం టౌన్ ప్లానింగ్ సెక్షన్ పర్యవేక్షణ చేస్తుంది. వినోదం, ప్రకటనల పన్నుల విషయంలో ఉన్న లోపాలను సరి దిద్దే చర్యలు ఇప్పటికైనా చేపట్టాలని పట్టణ వాసుల డిమాండ్ వినిపిస్తున్నారు.

### ఆదాయం పెంపుపై దృష్టి పెడతాం



మున్సిపాలిటీలో ఆదాయం పెంపు విషయంలో చేపట్టాల్సిన చర్యలపై దృష్టి పెడతాం. ఈ అంశంలో ఇప్పటికే అధికారులను అప్రమత్తం చేస్తున్నాం. ఫీజులు కట్టి అనుమతులు తీసుకొని హోర్డింగులు, ప్రకటన బోర్డులు పెట్టాలి. లేదంటే మున్సిపాలిటీ వాటిని తొలగిస్తుంది. వినోదపు పన్నుల విషయంలో మొదటి నుంచి కొన్ని లోపాలున్నాయి. వాటిని సరిదిద్దుతాం.

– ఎం.అంజయ్య, మున్సిపల్ కమిషనర్